# కృతజ్ఞతలు

'కడప కథ ఒక విశ్లేషణ' అనే పరిశోధనాంశాన్ని సూచించి, పర్యవేక్షక బాధ్యత వహించి, విషయ విశ్లేషణ పద్ధతుల్ని వివరించి, సలహాలను ఇచ్చి, సందేహాలను నివృత్తి చేసి, ప్రోత్సహించిన సహృదయులు, ఆత్మీయ గురువర్యులు, శాఖాధ్యక్షులు ఆచార్య యస్.రాజేశ్వరి గారికి నా హృదయపూర్వక కృతజ్ఞతాభివందనాలు.

శ్రీ వేంకటేశ్వర విశ్వవిద్యాలయం ఆర్ట్స్ కళాశాల ప్రిన్సిపాల్ ఆచార్య.కె.మునిరత్నం గారికి, బోర్డ్ ఆఫ్ స్టడీస్ ఛైర్మన్ ఆచార్య.పేట శ్రీనివాసులు రెడ్డి గారికి, నా పరిశోధనకు తగిన సలహాలు, సూచనలు అందించిన ఆచార్య. కోసూరి దామోదరనాయుడు గారికి, ఆచార్య.ఎన్.మునిరత్నమ్మ గారికి, ఆచార్య మేడిపల్లి రవికుమార్ గారికి, ఆచార్య.ఆర్. రాజేశ్వరమ్మ గారికి నా హృదయపూర్వక నమస్సుమాంజలులు.

నా పరిశోధనకు కావలసిన విషయసామగ్రి సేకరణలో సహకరించి అన్ని విధాలుగా సహాయ సహకారాలు అందించి ప్రోత్సహించిన ఆత్మీయులు శ్రేయోభిలాషులు శ్రీ మధుసూదన్ రాజు గారికి, శ్రీ సుందరేశ్వరరావు గారికి ధన్యవాదాలు.

నాకు జన్మనిచ్చి, ఎల్లవేళలా నా శ్రేయోభివృద్ధిని కాంక్షించే పూజ్యనీయ తల్లిదండ్రులు శ్రీమతి దస్తగిరమ్మ, శ్రీ కె.యన్.పీరుసాహెబ్ గార్లకు నా నమస్కారములు, నా పరిశోధనకు సహకరించిన నా శ్రీమతి హసీనాకు కృతజ్ఞతలు. మా చిన్నారులు చి॥కుషుమేష్, చి॥వేద గీష్పత్ లకు శుభాశీస్సులు

నా పరిశోధనకు ప్రత్యక్షంగా, పరోక్షంగా సహకరించిన హితులు, సన్నిహితులు అందరికీ నా ధన్యవాదాలు.

కె.పెద్ద పీరయ్య.

# ప్రవేశిక

ఆధునిక వచనప్రక్రియల్లో విస్తృతప్రచారాన్ని, విశేష పాఠక ఆదరణను పొందినది 'కథ'. తెలుగు సాహిత్యంలో కథకు ప్రత్యేకస్థానం ఉంది. కథ సమాజంలోని విభిన్న కోణాలను స్పృశించింది. మానవ జీవితంలోని లోతు పాతుల్ని తరచి చూసింది. సమాజం పట్ల బాధ్యత కలిగిన ఆధునిక రచయిత కథలు రాయడానికి పూనుకుంటాడు. గురజాడ -దిద్దుబాటుతో మొదలైన కథా ప్రస్థానం నేటి వరకు నిరాటంకంగా సాగుతున్నది. మారుతున్న కథా పరిణామాన్ని తెలుసుకోవాలంటే ఈ కథలకు శాశ్వతత్వాన్ని కల్పించాలి. అందుకు కథా సంపుటాలు, కథాసంకలనాలు ఉపకరిస్తాయి.

ఒక రచయిత రాసిన కథలను చేర్చి ఒక పుస్తకంగా ముద్రిస్తే అది 'కథాసంపుటి', వివిధ రచయితలు రాసిన కథలను ఒక పుస్తకంగా ముద్రిస్తే అది 'కథాసంకలనం'. ఇప్పటి వరకు చాలా రకాల కథసంకలనాలు వచ్చాయి. వాటిని కొన్ని విభాగాలుగా చూస్తే దళిత కథలు (కులం), వతన్ (మతం), నూరేళ్ళపంట (జెండర్), ఇప్పపూలు (తెగ), వృత్తి కథలు, ఉద్యమ కథలు, పురాతన భౌగోళిక కథలు, జిల్లా కథలు, సామాజిక సమస్య కథలు - ఈ విధంగా కనిపిస్తాయి. కథా రచయితలు, కేంద్ర రాష్ట్ర సాహిత్య అకాడమీలు, విశాలాంధ్ర వంటి ప్రచురణసంస్థలు వివిధ జిల్లాల్లోని ప్రాంతీయ కథానిలయాలు కథాసంపుటాలను, కథాసంకలనాలను వెలువరిస్తున్నాయి.

ఈ విధంగా కథాసంకలనాలను వెలువరిస్తున్న సంస్థలలో కడప జిల్లా నందలూరు కథానిలయం కూడా ఒకటి. వీరు 'కడపకథ' అనే పేరుతో కథా సంకలనాన్ని జనవరి-2007 సంవత్సరంలో వెలువరించారు.

సాహిత్య, సాంస్కృతిక రంగాలలో తెలుగు నాట కడప జిల్లాకు ఒక విశిష్టమైన స్థానం వుంది. నాచన సోమన, పదవికతా పితామహుడు తాళ్ళపాక అన్నమాచార్యుడు, తెలుగు కవయిత్రి-తాళ్ళపాక తిమ్మక్క, ప్రజాకవి వేమన, కాలజ్ఞాన కర్త పోతులూరి వీరబ్రహ్మం కడపనేల నుండి సాహితీసువాసనలు వెదజల్లినవారే.

గత 50 యేళ్ళ కాలంలో కడప జిల్లా నుండి ఎందరో కథారచయితలు ఉద్భవించి, ఎన్నో గొప్ప కథలు రచించారు.

ఈ నేపథ్యంలో జిల్లా సాహితీ విశిష్టతను చాటే ప్రయత్నంలో భాగంగా, కడప కథా సంకలనాన్ని 'నందలూరు కథానిలయం' ప్రచురించింది. తెలుగునాట ప్రాంతాలవారిగా కథాసంకలనాలను వెలువరించే ఒరవడి ఒకటిన్నర దశాబ్దం క్రింద ప్రారంభమైన నేపథ్యంలో, ఆ తరహాలో కడప జిల్లా ప్రాతినిధ్యాన్ని కూడా నెలకొల్పడమే కడప కథ సంకలన ఉద్దేశం. ఈ కథాసంకలనంలో 1956 నుండి 2006 వరకు వెలువడిన 47 కథల్ని ఎన్నుకోవడం జరిగింది. వీటికి సంపాదకులు- తవ్వా ఓబుల్‌రెడ్డి, ప్రచురణ కర్త- ఎ.రాజేంద్ర ప్రసాద్.

తెలుగు కథాసంకలనాల మీద ఇదివరకే కొన్ని పరిశోధనలు జరిగాయి. 'సీమ కథలు- సామాజికాంశాలు' అనే అంశంపై పి.రంగయ్య పరిశోధన చేశారు. 'కథావార్షికలు (2000-2006) - సవిమర్శక పరిశీలన' అనే అంశంపై చిత్తూరు నాగమ్మ పరిశోధన చేశారు. 'కథావాహిని కథాసంకలనాలు- ఒక పరిశీలన (2005-2009)' అనే అంశంపై సాకె నాగరాజు పరిశోధన చేశారు.

'ప్రాంతీయత' అనే భావన ఆధారంగా వచ్చిన కథలు ప్రధానంగా వెలువడిన సంకలనమిది. ఆ ఆలోచనలో భాగంగా ఈ సంకలనంలోని కథలు కడప ప్రాంత సమాజాన్ని ఎంతవరకు ప్రతిబింబించాయో తెలపడం కోసం, కడప కథల విశిష్టతను విశదపరచాలనే సదుద్దేశంతో 'కడపకథ' ను పరిశోధనాంశంగా స్వీకరించడం జరిగింది. 'కడప కథ ఒక విశ్లేషణ' అనే సిద్ధాంత వ్యాస గ్రంథాన్ని ఐదు అధ్యాయాలుగా వర్గీకరించి విశ్లేషించడం జరిగింది.

**(1) కడపకథ - రచయితల జీవితనేపథ్యం.**

**(2) కడపకథ - ఇతివృత్త వైవిధ్యం**

**(3) కడపకథ - పాత్రచిత్రణ**

**(4) కడపకథ - శిల్పవైవిధ్యం**

**(5) కడపకథ - భాషాపరిశీలన**

## మొదటి అధ్యాయం - కడపకథ రచయితల జీవిత నేపథ్యం

ఈ అధ్యాయంలో కథానిక నిర్వచనం, కడప జిల్లాలో కథానికావిర్భావానికి గల కారణాలు, కథను గురించి వివరించడం జరిగింది. కడప కథాసంకలనంలో 47 కథలను 48 మంది రచయితలు రాశారు. కడప కథా రచయితల జీవిత విశేషాలు, రచనలు, బిరుదులు, గౌరవ సత్కారాలు మొదలైన వాటి గురించి తెలియజేయడమైనది. రచయితలను గ్రామీణ, పట్టణ, స్త్రీ, పురుష రచయితలుగా వర్గీకరించడం జరిగింది.

## రెండవ అధ్యాయం - కడపకథల్లో ఇతివృత్త వైవిధ్యం

ఈ అధ్యాయంలో కథావస్తువును అనుసరించి ఇతివృత్త వర్గీకరణ జరిగింది. ఈ కథాసంకలనంలో వున్న రచయితలు, సమకాలీనత పట్ల వారికున్న దృక్కోణాన్ని తెలిపే ప్రయత్నం చేయడం జరిగింది. నాటి జన జీవన పరిణామాలను సామాజిక, ఆర్థిక కోణాలను ఆవిష్కరించడం జరిగింది. ఈ కథల్లో మానవ సంబంధాల విలువలు ఎక్కువగా ప్రసరించి, వాస్తవ జీవితానికి దగ్గరగా వున్నాయి. ఈ సంకలనంలోని 47 కథల్ని కథా వస్తువు ఆధారంగా నా పరిశోధన కోసం ఎనిమిది రకాలుగా వర్గీకరించడం జరిగింది.

(1) మానవ సంబంధేతివృత్తాలు

(2) కుటుంబ సంబంధేతివృత్తాలు

(3) దళిత సంబంధేతివృత్తాలు

(4) ఫ్యాక్షన్ ఇతివృత్తాలు

(5) స్త్రీల సమస్యేతివృత్తాలు

(6) రైతు సమస్యేతివృత్తాలు

(7) వృత్తి సంబంధేతివృత్తాలు

(8) మైనారిటీ సంబంధేతివృత్తాలు

## మూడవ అధ్యాయం - కడపకథల్లో పాత్రచిత్రణ

కథకు వస్తువు, తర్వాత పాత్ర చిత్రణ ప్రధానం. ఈ అధ్యాయంలో పాత్ర చిత్రణ నిర్వచించి ఆయా పాత్రలను వర్గీకరించడం జరిగింది.

(1) పురుష పాత్రలు

(2) స్త్రీ పాత్రలు

(3) పిల్లల పాత్రలు

పురుష పాత్రలను మరల 'చైతన్యవంతమైన పాత్రలు, 'రైతు పాత్రలు', 'వృత్తి పాత్రలు', 'పురుషాహంకార పాత్రలు', 'దళిత పాత్రలు', ఆదర్శ పాత్రలు', 'ఫ్యాక్షన్ పాత్రలు' గా విభజించడం జరిగింది.

అదే విధంగా స్త్రీల పాత్రలను 'సంప్రదాయానికి బలైన పాత్రలు,' ప్రేమ రాహిత్య పాత్రలు', 'పురుషాధిపత్యానికి బలైన పాత్రలు', 'చైతన్యవంతమైన పాత్రలు'గా వర్గీకరించడం జరిగింది.

ఈ అధ్యాయంలో శివు, సిన్నిగాడు, ఓబిగాడు, లావణ్య అనే నలుగురు చిన్న పిల్లల పాత్రలను వివరించడం జరిగింది.

ప్రగతిశీల దృక్పథంలో,కాల్పనిక,వాస్తవికతల సమ్మేళనంతో రచయితలు ఈ పాత్రల్ని తీర్చిదిద్దిన తీరును సైద్ధాంతిక సమన్వయంతో ఈ అధ్యాయంలో వివరించడమైనది.

## నాల్గవ అధ్యాయం - కడపకథల్లో శిల్పవైవిధ్యం

ఈ అధ్యాయంలో శిల్పం గురించి నిర్వచించడం జరిగింది. కడప కథ - కథా రచయితలు కథ నిర్వహణలోనూ, నేపథ్య స్థల కాలాల చిత్రణలోనూ, భాషా శైలిలోనూ ప్రత్యేకత చూపించారు. దృష్టి కోణం, కంఠస్వరం, కథాకథనం, కథాశిల్పానికి మెరుగులు దిద్దుతాయి. రచయితలు సంఘటనా శిల్పం, సన్నివేశ కల్పనా శిల్పం, వర్ణనాశిల్పం, శీర్షికాశిల్పం, మాండలిక శైలి శిల్పం, సంఘటనా ఘటనా శిల్పం - వంటి శిల్పరీతుల ద్వారా రచయితలు కథల్ని చిత్రించిన విధానాన్ని సోదాహరణంగా వివరించడమైనది. ఎత్తుగడ, ముగింపు తీర్చిదిద్దిన తీరును విశేషించడమైనది.

**ఐదవ అధ్యాయం - కడపకథల్లో భాషాపరిశీలన**

ఈ సంకలనం 47 కథల్లో రచయితలు ఉపయోగించిన ఆయాపాత్రల మాండలిక పదాలు, సందర్భానుసారంగా ఉపయోగించిన ఆ ప్రాంత జాతీయాలు, కథలో లౌక్యాన్ని ప్రదర్శించడానికి, విషయాన్ని నర్మగర్భంగా చెప్పడానికి ఉపయోగించిన ప్రాంతీయ సామెతలు మరియు వ్యవహార సామెతలు, సంభాషణలు రమ్యంగా ఉండటానికి ఉపయోగించిన జంట పదాలు, పాత్రను రక్తి కట్టించేందుకు వాడిన సాదృశ్యాలను, ధ్వనికి నిండుతనాన్ని ఏర్పరిచే ధ్వన్యనుకరణ శబ్దాలను వివరించడమైనది.

ఉపసంహారంలో పైన పేర్కొన్న ఐదు అధ్యాయాల్లో చర్చించి, పరిశోధించి నిగ్గుతేల్చిన విషయాన్ని, తెలియపరచడం జరిగింది.

అనుబంధంలో కడప పరిసరప్రాంత మాండలికపదాలకు వ్యవహార పదాలు ఇవ్వడమైనది. అనుబంధం రెండులో కడప కథ సంకలనంలోని రచయితలను వారు రాసిన సంకలనంలోని కథను అకారాది క్రమంలో చేర్చడమైనది.

ఉపయుక్త గ్రంథ సూచిలో పరిశోధనకు ఉపకరించిన గ్రంథాలను అకారాది క్రమంలో పొందుపరచడం జరిగింది. చివరలో పరిశోధనా వ్యాసాలను పొందుపరచడం జరిగింది.